సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం, 4, ఏప్రిల్, 2025



సోమశిలలో 53.042 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 53.042 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.94,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,507
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,762
నవర (8 గ్రాములు)	రూ.70,096

గరిష్టం/కనిష్టం
35.5 /28.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ గురువారం 73 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితా

నెల్లూరు (టౌన్): సెకండరీ గ్రేడు, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ తుది జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కోసం సబ్జెక్టు వైజ్ సీనియారిటీ జాబితాలను కూడా డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. జాబితాలపై ఈనెల 11వ తేదీలోపు అభ్యంతరాలను తీసుకుంటామని, తగిన ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు మంత్రి పార్థసారథి జిల్లా పర్యటన



నెల్లూరు రూరల్: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డితో కలిసి తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌ను మంత్రి పరిశీలిస్తారు. 11.30 గంటలకు పొదలకూరులో హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడతారు. మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు గూడూరుకు వెళతారు.

ఎట్టకేలకు వార్డెన్లకు చార్జి మెమోలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బీసీ సంక్షేమ శాఖలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు హాస్టల్ వార్డెన్లకు ఎట్టకేలకు చార్జ్ మెమోలను ఇచ్చారు. కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకట లక్ష్మమ్మ మెమోలను గురువారం జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని విడవలూరు, మైపాడు బీసీ బాలుర హాస్టల్‌లో వార్డెన్లు రెండేళ్లుగా అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయి. సాక్షి పత్రికలో వార్డెన్ల అక్రమాలపై కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో వారిచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో చార్జ్ మెమోలను జారీ చేశారు. అయితే వార్డెన్లకైతే మెమోలు ఇచ్చారు గానీ, రెండేళ్ల వారి అక్రమాలకు సహకరించిన ఉన్నతాధికారులు, హాస్టళ్లను పర్యవేక్షణ చేసిన అధికారులపై చర్యల ఊసే లేకపోవడంపై ఆశాఖలో గుసగుసలు వినపడుతున్నాయి.

జిల్లా సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

ఉదయగిరి: జిల్లాలో అన్ని రంగాలలో వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా సాధించుకునేందుకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆయన గురువారం సాధన సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతం ఎన్నో ఏళ్లగా పూర్తి వివక్షకు గురవుతూ నేటికీ సరైన తాగు, సాగునీరు లేక పోవడంతో ఈ ప్రాంతంలో వలసలు ఎక్కువవడంతో పల్లెప్రాంతాలు బోసిపోయి దర్శనమిస్తున్నాయన్నారు. ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని 21 మండలాలను కలుపుకుని ఉదయగిరిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సాధన సమితి సభ్యులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల్లో అక్రమాలకు తావివ్వొద్దు


ఉలవపాడు: దేవదాయశాఖకు సంబంధించిన భూముల్లో అక్రమాలు జరగకుండా చూడాలని ఆ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ఉలవపాడులోని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములను ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని శానంపూడిలో గురువారం పరిశీలించిన అనంతరం ఆయన ఉలవపాడు దేవస్థానం వద్దకు వచ్చి మాట్లాడారు. శానంపూడిలో భూములు లీజుకు తీసుకున్న వ్యక్తి అందులో రాళ్లు ఎత్తడం చేస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఈఓ శ్రీనివాస్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్‌గా చెడగొడుతున్నాయ్!

కందుకూరు రూరల్: యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఒక వీడియోను ఓపెన్ చేస్తే చాలు ముందు వచ్చేది యాడ్స్. ఆ యాడ్స్ కూడా అశ్లీలంగా ఉంటాయి. ఆసక్తి కలిగించేలా థంబ్ నెయిల్ టైటిళ్లు ఉంటాయి. ఉదాహరణకు.. లవ్, ఫ్యాషన్, సెక్స్ గురించి మాట్లాడుకోవడం లేదా తెలుసుకోవడంలో తప్పేముంది. వెంటనే ఈ యాప్ డౌన్‌లోన్ చేసుకోండని ఒక యాడ్. మీకు గార్ల్ ఫ్రెండ్. బాయ్‌ఫ్రెండ్ లేదని బాధపడుతున్నారా... ఒంటరిగా ఫీలవుతున్నారా.. ఇంకెందుకు ఆలస్యం ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎంజాయ్ చేయండి.. ఇది మరో యాడ్.

దారుణంగా థంబ్ నెయిల్

యూట్యూబ్ వీడియోలో థంబ్ నెయిల్ టైటిల్స్ మరీ దారుణంగా ఉంటున్నాయి. వయస్సులో ఉన్నవాళ్లు ఈ వీడియోను ఒంటరిగా చూడండి. చిన్నపిల్లలకు దూరంగా ఉండి ఈ ఆడియోను వినండి. పెళ్లిలో శృంగారం పాత్ర ఎంటీ? ఇలా రకరకాలుగా పిల్లలను ఆకర్షించే విధంగా టైటిళ్లు పెడుతున్నారు. అవి చూసిన పిల్లలు తెలిసీ తెలియక ఈ వీడియో ఎంటి ఇలా ఉంది డాడీ అని ఒకరు. శృంగారం అంటే ఎంటీ మమ్మి ఒక పావ.. ఈ వీడియోలో చిన్న చిన్న బట్టలు వేసుకున్నారెంటమ్మా అని మరొకరి ప్రశ్న. ఇలా తల్లిదండ్రులకు పిల్లల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నా పిల్లల అల్లరిని తట్టుకోలేక స్మార్ట్ ఫోన్లు ఇస్తున్నారు. గతంలో వీడియో గేమ్స్‌కు ఎక్కువగా పిల్లలు ఆకర్షితులు అవుతున్నారని గేమ్‌లు డౌన్‌లోన్ చేయడం లేదు. అయితే నేరుగా యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు ఓపెన్ చేసి వీడియో చూస్తుండు అని తల్లిదండ్రులు చెప్పి వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ ఆ వీడియో చూస్తూ ఉన్న సమయంలో మధ్య మధ్యలో అశ్లీల యాడ్స్ వస్తున్నాయి. వాటిని చూసిన పిల్లల ఆలోచనా సరళి మారిపోతోంది.



తల్లిదండ్రులే కారణమా..?

యూట్యూబ్‌లో తల్లిదండ్రులు ఏ విధమైన వీడియో చూస్తున్నారో ఆ అంశాలకు అనుగుణంగానే ఆ తర్వాత వచ్చే వీడియోలు డిస్‌ప్లే అవుతుంటాయి. తండ్రి లేక తల్లి ఎలాంటి వీడియో చూస్తున్నారో అదే ఫోన్ పిల్లలు చూస్తుంటే అలాంటివే తిరిగి మీకు ముందుగా ఓపెన్ అవుతుంటాయి. యూట్యూబ్‌లోనే స్క్రోలింగ్ వీడియో చూసి ఏ వీడియోకి అయితే లైక్ కొడతామో అలాంటి రిలేటెడ్ వీడియోలే తిరిగి వస్తుంటాయి. ఇలా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వీడియోలు వస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఫోన్ పిల్లలకు ఇస్తున్నారంటే మీరు ఎలాంటి వీడియో చూస్తున్నారో వారికి కూడా అర్థమవుతుంది. వాటినే పిల్లలు చూసేలా మీరే పరోక్షంగా కారణం అవుతున్నారు.


సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



ఆధునిక ప్రపంచంలో సామాజిక మాధ్యమాల అవసరం ఉన్నప్పటికీ.. వాటి వినియోగంలో పరిపక్వతను, విజ్ఞతను పాటించాల్సిన అవసరం ఉంది. సామాజిక మధ్యమాలు, మొబైల్ గేమ్స్‌కు బదులు పిల్లలు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి. మొబైల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. చిన్న పిల్లలు అల్లరి చేస్తున్నారని మీ ఫోన్ పిల్లలకు ఇచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ పి.పాపారావు, ఆల్ ఇండియా సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

స్మార్ట్‌ఫోన్లతో అనర్థాలు



స్మార్ట్‌ఫోన్ల వల్ల అనర్థాలు జరుగుతున్నాయి. కళాశాలల్లో ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడే విద్యార్థులు కూడా వేల రూపాయల మొబైల్స్ వాడుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఇలాంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. కానీ ఎంత వరకు ఉపయోగించాలో అంతే ఉపయోగించాలి. అది కాస్తా వీరే కార్యకలాపాలకు దారి తీస్తున్నాయి. కళాశాలలకు ఫోన్లు తీసుకురావడం నిషేధించేందుకు ప్రయత్నించాలి.

– డాక్టర్ ఎం.రవికుమార్, టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

గమనించకపోతే అంతే సంగతులు..

ఇది ఇలా ఉంటే ప్రాథమిక స్థాయి విద్యార్థులకు హోమ్ వర్క్ ఇస్తున్నారు. ఇంటి వద్ద వర్క్ చేసేటప్పుడు అర్థం కాకపోతే తల్లిదండ్రులను అడగండి లేదా రేపు స్కూల్‌కు వచ్చిన తర్వాత ఆ వర్క్ చేయండని ఉపాధ్యాయులు చెప్పాలి. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయులు ఆ ప్రశ్న అర్థం కాకపోతే గూగుల్‌లో కొట్టండి లేదా యుట్యూబ్‌లో చూడండని చెప్తున్నారు. ఇళ్లకు వచ్చిన పిల్లలు మా సార్ ఫోన్‌లో చూసి ఈ లెక్కలు చేయమన్నాడని తల్లిదండ్రులను అడుగుతున్నారు. ఇక ఫోన్ వాళ్ల చేతికి పోతుంది. ఆ విద్యార్థి లెక్కలు చేస్తున్నాడా... ఇకేమైనా చూస్తున్నాడా అనేది ఆ తల్లిదండ్రులకు అర్థం కాదు. ఇలా ఓ తండ్రి కుమారుడికి ఫోన్ ఇస్తే లెక్కలకు బదులు ఏమి చూస్తున్నాడో గమనించాడు. తరువాత ఉపాధ్యాయుని వద్దకు వెళ్లి మీరు పిల్లలకు ఫోన్లు చూసి వర్క్ చేయమని చెప్పడం ఏమిటని ప్రశ్నించాడు. కానీ ఇలా అందరు పేరెంట్స్ అడగలేరు కదా.

స్మార్ట్ ఫోన్లతో నష్టమే..

స్మార్ట్ ఫోన్లతో ఎంత మేలు ఉందో... అంతే చెడు కూడా ఉందని మానసిక వైద్య నిపుణులు చెప్తూనే ఉన్నారు. కానీ ప్రస్తుతం ఫోన్లు లేని విద్యార్థులు ఉండడం లేదు. పదో తరగతికి వచ్చారంటే ఫోన్ కచ్చితంగా ఉండాల్సిందే. ఇంటర్మీడియట్ చదివే పిల్లలను కాలేజీలకు ఫోన్లు తీసుకురావద్దన్నా వినడం లేదు. కందుకూరులోని కళాశాల సంక్షేమ హాస్టళ్లలోని అబ్బాయిలు, అమ్మాయిలు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. ఈ ఫోన్ల వల్ల ఏ విద్యార్థి కూడా సమయానికి నిద్ర పోవడం లేదు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో వీడియోలు ఓపెన్ చేసి చూస్తుంటే ఎప్పుడు ఆపుతారో కూడా తెలియని పరిస్థితి. దీని వల్లనే గాఢ నిద్ర లేక మానసికంగా యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రీడా మైదానాల్లో ఉండాల్సిన విద్యార్థులు ఫోన్లు పట్టుకొని చెట్ల కింద, రూమ్‌లలో ఉండిపోతున్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



వెంకటంపేటలో రీసర్వేపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

దుత్తలూరు: రైతులంతా సహకరిస్తేనే రీసర్వే విజయవంతంగా కొనసాగుతుందని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకటంపేటలో రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఉపాధిహామీ పథకం కింద మూగజీవాల తాగునీటి కష్టాలు తీర్చే నీటితొట్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంనాడు భూముల రీసర్వే జరిగిందని, వందేళ్ల తర్వాత మరలా ప్రస్తుతం జరుగుతోందన్నారు. గతంలో చైన్ల ద్వారా రీసర్వే చేసేవారని, ప్రస్తుతం జీపీఎస్ విధానంలో రీసర్వే చేస్తుండటంతో ఎలాంటి తప్పిదాలు ఉండవన్నారు. పట్టా అసైన్‌మెంట్ భూముల్లో వివాదాలు అధికంగా ఉన్నాయని, రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. రైతులకు నోటీసులు జారీచేసిన అనంతరమే రీసర్వే చేపట్టాలన్నారు. అంతకుముందు నందిపాడు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త బోగ్యం సరస్వతి సెల్‌ఫోన్ తీసుకొని యాప్‌లో నమోదుచేసిన వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దుత్తలూరులో పీఎం సూర్యఘర్ పథకం కింద వినియోగదారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ మల్లికార్జున, సీడీపీఓ సునీత, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈలు మణికుమార్, రామకృష్ణారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు షేక్ షాను, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దుత్తలూరు పర్యటనలో భాగంగా దుత్తలూరులోని సీడ్స్ సంస్థను కలెక్టర్ ఆనంద్ సందర్శించారు. ఆ సంస్థ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ వ్యవసాయ సాగు, విద్య, నైపుణ్య శిక్షణా తరగతులు, తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీడ్స్ సిబ్బంది ఉన్నారు.

200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ రేషన్ బియ్యంతో అధికారులు



రైస్‌మిల్లులో పట్టుబడ్డ పేదల బియ్యం

- రీసైక్లింగ్ చేసి మేలి రకం బియ్యంలో కలిపి విక్రయం

కొడవలూరు: కొడవలూరు మండలం చంద్రశేఖరపురం గ్రామంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వాటిని రీసైక్లింగ్ చేసి మేలి రకం బియ్యంలో కలిపి విక్రయిస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో కోవూరు, ఆత్మకూరు సీఎస్ డీటీలు బాల కోటమ్మ, అజీజ్‌లు గురువారం రైస్ మిల్లుపై దాడి చేసి తనిఖీలు చేపట్టారు. రైస్‌మిల్లులో సుమారు 200 బస్తాల రేషన్ బియ్యం ఉండగా, ఇందులో 30 బస్తాలు రేషన్ షాపులకొచ్చే బస్తాల్లోనే ఉన్నాయి. మిగిలినవి రీసైక్లింగ్ చేసి ప్లాస్టిక్ గోతాల్లో నింపి ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తం బస్తాలను సీజ్ చేసి పౌరసరఫరాల శాఖ గిడ్డంగికి తరలించారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ బాలకోటమ్మ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ సునీల్ కుమార్‌రెడ్డి, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు. ఇక్కడి రైస్ మిల్లును ఒంగోలు చెందిన వ్యక్తికి లీజుకిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆ వ్యక్తి కేవలం రేషన్ బియ్యం రీసైక్లింగ్ మినహా ధాన్యం ఆడించడం చేయడం లేదని అధికారులు నిర్ధారించారు. గతంలో కూడా ఈ రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టుబడింది. నిందితుల పట్ల కఠిన చట్టాలు అమలు చేయకపోతుండడంతో యథావిధిగా ఈ వ్యాపారం కొనుసాగిస్తూ రూ.లక్షలు జేబుల్లో వేసుకొంటున్నారు.

కప్పం కట్టి.. రేషన్ దందా!

- ప్రతి నెలా ఏడు వేల మెట్రిక్ టన్నుల సేకరణ
- పాలిషింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఆరు రైస్ మిల్లులు
- పాలిష్ చేసి చెన్నై మార్కెట్‌కు తరలింపు
- కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి
- పచ్చ నేతలకు నెలకు రూ.కోట్లలో ఆదాయం
- విజిలెన్స్, పోలీస్ శాఖలకు మామూళ్లు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పేదలకు అందాల్సిన చౌక బియ్యం.. పచ్చనేతలకు కాసులు కురిపించే వ్యాపార వస్తువుగా మారింది. జిల్లాలో 1513 చౌకదుకాణాలు ఉన్నాయి. ప్రతినెలా 13 వేల మెట్రిక్ టన్నుల బియ్యం కార్డుదారులకు పంపిణీ జరుగుతుంది. 11 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. బియ్యం పంపిణీలో దాదాపు 60 శాతం అంటే 8 వేల మెట్రిక్ టన్నులు రీసైక్లింగ్ చేస్తున్నారు. ఈ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు 12 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించి మొత్తం మీద 20 వేల టన్నుల వరకు రేషన్‌బియ్యాన్ని పాలిషింగ్ చేసి చెన్నై మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

నియోజకవర్గం ఒకరికే..

నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఓ వ్యాపారి రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. కందుకూరులో ఒంగోలుకు చెందిన వ్యాపారికి అప్పగించారు. ఉదయగిరిలో జలదంకి చెందిన లోకల్ ప్రజాప్రతినిధి అనుచరుడు, ఆత్మకూరు, కోవూరులో నెల్లూరుకు చెందిన వ్యాపారులు దందా నిర్వహిస్తున్నారు. కావలిలో లోకల్ వ్యాపారికే అప్పగించారు. ఇలా నియోజకవర్గాల వారీగా ఒక్కో వ్యాపారికి అప్పగించి వారి నుంచి నెలవారీగా సుమారు రూ.25 లక్షల వరకు ఎమ్మెల్యేలు కప్పం వసూలు చేస్తున్నారు.

రైస్‌మిల్లుల్లో పాలిషింగ్ చేసి..

ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం సేకరణ చేస్తారు. సేకరించిన బియ్యాన్ని సదరు వ్యాపారికి చెందిన అల్లీపురంలోని గుడిపల్లిపాడు, మూడో మైలు వద్ద, రాజుపాళెం సమీపంలో ఉన్న రైస్‌మిల్లు, వెంకటాచలం మండలం పోర్టు వద్ద రైస్‌మిల్లు, బుచ్చిరెడ్డిపాళెంలోని విలియమ్స్‌పేట వద్ద ఉన్న రైస్‌మిల్లుకు, లింగసముద్రం మండలం పెదపవనిలోని రైస్ మిల్లుకు, కందుకూరులోని ఓగూరులో రైస్‌మిల్లుకు తరలిస్తారు. అక్కడ రీపాలిష్ చేసి బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి చెన్నైకు తరలిస్తారు. చెన్నైలో పాలిష్ చేసిన బియ్యాన్ని కేజీ రూ.50 వంతున అక్కడ వ్యాపారులకు విక్రయిస్తారు. దాంతో పాటు పాలిష్ చేయని బియ్యాన్ని మాత్రం కృష్ణపట్నం పోర్టు ద్వారా ఎగుమతులు చేస్తారన్న ఆరోపణలున్నాయి.

ఉమ్మడి జిల్లాల నుంచి సేకరణ

మంత్రి నారాయణ ఇలాఖాకు చెందిన బియ్యం మాఫియా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పాటు మరో ఉమ్మడి ప్రకాశం, కడప రేషన్ బియ్యం సేకరణ చేస్తారు. ప్రకాశం జిల్లా నుంచి కందుకూరు, కావలి మీదుగా నెల్లూరుకు బియ్యం రవాణా జరుగుతుంది. ఇలా సేకరించిన బియ్యాన్ని ఎన్టీఆర్ నగర్‌లోని గోదాముల్లో నిల్వ ఉంచుతారు. అక్కడ నుంచి రాత్రి వేళల్లో రైస్‌మిల్లుకు తరలించి రీసైక్లింగ్ చేస్తారు. గోదాముల నుంచి నేరుగా చెన్నై, పోర్టులకు వెళ్తాయి.

నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ రేషన్ బియ్యం వ్యాపారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన స్నేహితుడితో కలిసి మాఫియాను హస్తగతం చేసుకున్నారు. గతంలో నెల్లూరు నగరంలోని దాదాపు వెయ్యి మంది చిరు వ్యాపారులు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్ల నుంచి పేదలకందాల్సిన బియ్యాన్ని కొనుగోలు చేసి తద్వారా సదరు వ్యాపారికి విక్రయించేవారు. కేజీకి రూ.16 వంతున డీలర్లకు అప్పగించి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వ్యాపారికి కేజీ రూ.23 వంతున విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిరువ్యాపారులను పక్కన పెట్టేశారు. కార్పొరేషన్ పరిధిలో మంత్రి నారాయణ కీలక అనుచరుడితో పాటు నెల్లూరు రూరల్ షాడో ఎమ్మెల్యేలకు నెలసరిగా రూ.లక్షల్లో ముట్టుజెప్పేలా ఒప్పందం చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

అధికారులకు ముడుపులు

చౌక బియ్యం దందా సజావుగా సాగేందుకు రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్, పౌర సరఫరా శాఖలకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రాత్రివేళల్లో రేషన్ బియ్యం వాహనాల్లో లోడింగ్ జరుగుతుండే విషయం అందరికీ తెలిసినా ఆ వైపు కన్నెత్తిచూడరు. విజిలెన్స్, పోలీస్ శాఖలకు ఫోన్ చేస్తే సదరు వ్యాపారికి ఫోన్ వెళ్తుంది. వెంటనే ఫోన్ చేసిన వారికి బెదిరింపు కాల్స్ వస్తాయి. పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫోన్‌చేస్తే మాకు మెన్ లేరు. పోలీసులకు ఫోన్‌చేయండి అంటూ కాల్ కట్ చేస్తారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. చౌక దుకాణాల ద్వారా రేషన్ కార్డు దారులకు బియ్యం సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు చేపడతాం. బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదులు చేస్తే దాడులు చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. రేషన్ సక్రమంగా పంపిణీ జరిగేలా మండల స్థాయి అధికారులకు ఆదేశాలిస్తాం.

– అంకయ్య ఇన్‌చార్జ్, డీఎస్ఓ

డీసీపల్లిలో 549 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 549 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ గురువారం తెలిపారు. వేలానికి 582 బేళ్ల రాగా వాటిలో 549 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 71217 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,90,29,919 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.280 రాగా కనిష్ట ధర రూ.250 లభించింది. సగటు ధర రూ.267.21గా నమోదైంది. వేలంలో 10 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9 నుంచి పెంచలకోనలో శ్రీవారి వసంతోత్సవాలు



పెంచలకోన క్షేత్రం

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. గురువారం ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ చైత్ర మాసం వసంత రుతువులో వసంతోత్సవాలు నిర్వహించడం ఆచారమన్నారు. 9న రాత్రి అంకురార్పణ, 10న ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 7 గంటలకు శేషవాహన సేవ, 11న రాత్రి 7 గంటలకు హంస వాహనసేవ, 12న రాత్రి 7 గంటలకు గజ వాహనసేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్పోర్ట్స్ కోచింగ్‌కు సంబంధించి ఆరువారాల సర్టిఫికెట్ కోర్సులు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఆర్‌కే యతిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్‌ఎస్ఎన్‌ఐఎస్) పాటియాలాలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించే సిక్స్ వీక్ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగా తదితర వాటిల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 14వ తేదీలోగా https://www.6wcc.nsni.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. చెన్నై వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం గుర్తుతెలియని వృద్ధురాలిని ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. మృతురాలి వయసు 60 సంవత్సరాల పైన ఉండొచ్చని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

కండలేరులో 48.241 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 48.241 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.115
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.50



వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులకు వేట నిషేధ భృతి క్రమం తప్పకుండా అందించింది. కూటమి ప్రభుత్వం మాత్రం ఆ విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. రెట్టింపు మొత్తం ఇస్తామని ఎన్నికల సమయంలో నేతలు ప్రకటించారు. కానీ గత సంవత్సరం పరిహారం ఇంకా అందలేదు. ఈ ఏడాది వేట నిషేధం మరికొద్దిరోజుల్లో మొదలవుతుంది. ఈసారైనా మాట నిలబెట్టుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మత్స్యకారులకు భరోసా లభించేనా?



ఒట్టూరు తీరంలో చేపల వేట సామగ్రి

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

- నాడు అండగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గతేడాది భృతికి మోక్షం కల్పించని కూటమి ప్రభుత్వం
- ఈసారైనా ఇచ్చేనా?



కావలి రూరల్ మండలం తుమ్మలపెంట తీరంలో ఉన్న మోటార్ బోటు

కావలి: రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో మర పడవల్లో అన్ని రకాల చేపల వేటపై ఈనెల 15 నుంచి జూన్ 16వ తేదీ వరకు నిషేధం ఉంటుంది. సంప్రదాయ పడవలు, తెడ్డు, తెరచాప పడవలు (ఇంజిన్ లేని) వారికి దీని నుంచి మినహాయింపు ఉంటుంది. మత్స్య సంపద పునరుత్పత్తి సమయంలో వేట చేయకూడదు. ఒకవేళ ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే శిక్షార్హులవుతారు. వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే ఇతర సంక్షేమ పథకాల నిలుపుదల చేస్తారు. జరిమానా విధింపుతోపాటు డీజిల్‌పై రాయితీ తొలగిస్తారు. వేట నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడానికి మత్స్య శాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తారు. ఇది చాలా ఏళ్ల నుంచి అమలవుతోంది. ఈ సమయంలో మత్స్యకారులకు జీవనోపాధి ఉండదు. వీరికి చేపల వేట మినహా మరో పనిచేయడం తెలియదు.

మత్స్య సందను కాపాడేందుకు విధించే వేట నిషేధ కాలంలో రిజిస్టర్డ్ మెకనైజ్డ్, మోటార్ ఫిషింగ్ బోట్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లకూడదు. ఈ నిషేధానికి సంబంధించి మత్స్యశాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేస్తారు. నిషేధ కాలం 61 రోజుల పాటు ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనోపాధి కోసం మత్స్యశాఖ వద్ద నమోదైన వివరాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందిస్తుంది. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంవత్సరానికి ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేసింది. అయితే రూ.20 వేలు వంతున అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించారు. గతేడాది భృతికి సంబంధించి జిల్లాలో 12,444 మంది మత్స్యకారులను అర్హులుగా గుర్తించారు. వారికి ఇంత వరకు నగదు సాయం అందలేదు. మరబోట్ల ద్వారా సముద్రంలో వేట సాగించే ఈ 12,444 మందికి రూ.20,000 చొప్పున రూ.24.89 కోట్లు మేర అందాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులు

గతేడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు సముద్రంలో ఏర్పడిన అల్పపీడనాలు, వాయుగుండాలు, తుపాన్ల ప్రభావంతో రోజుల తరబడి చేపల వేటకు వెళ్లలేకపోయామని, దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొద్దిరోజుల్లో సముద్రంలో చేపల వేటపై నిషేధం అమల్లోకి వస్తుందని, గత ఏడాది పరిహారం సొమ్మును ఇప్పటికైనా విడుదల చేయాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో మత్స్యకారుడి కుటుంబానికి రూ.20,000 అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్స్యకారుల గోడు పట్టించుకోవాలి



సముద్రంలో చేపలు వేట సాగక మత్స్యకారులు ఇప్పుడు కూడా ఇంటి పట్టునే ఉంటున్నారు. చేపల వేట నిషేధం ఈనెల నుంచి అమల్లోకి వస్తుంది. ఇప్పటికే కుటుంబాలు జరుగుబాటుకు అవస్థలు పడుతన్నాయి. మత్స్యకారుల గోడు ప్రభుత్వం పట్టించుకోవాలి. వేట విరామ ఆర్థిక సాయం రూ.20,000 ఇస్తానని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీనిపై తక్షణమే స్పందించాలి.

– కొమరి రాజు, మత్స్యకార నాయకుడు, కావలి

అంత కష్టం ఏమొచ్చిందో..

- ఉరేసుకుని 6వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య
- ఆత్మకూరులో ఘటన



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు



నిహారిక (ఫైల్)

ఆత్మకూరు: ఆడుతూ.. పాడుతూ తిరిగే బాలికకు ఏ కష్టమొచ్చిందో తెలియదు గానీ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన ఆత్మకూరులో గురువారం జరిగింది. ఎస్సై జిలానీ, స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని వందూరుగుంట ప్రాంతానికి చెందిన ప్రకాష్, రత్నమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. ప్రకాష్ పెయింట్ పనిచేస్తుంటాడు. రత్నమ్మ ప్రభుత్వాస్పత్రిలో తాత్కాలిక నర్సుగా వ్యవహరిస్తోంది. పెద్ద కుమార్తె నిహారిక (11) జెడ్పీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. నిహారిక గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. నానమ్మ భోజనం తినాలని చెప్పగా స్కూల్లోనే చేశానంది. ఆ సమయంలో రత్నమ్మ సమీపంలోని తెలిసిన వారింటికి వెళ్లింది. కొద్దిసేపటి అనంతరం ఆమె ఇంటికొచ్చి కుమార్తెను పిలవగా స్పందన లేదు. దీంతో నానమ్మ మిద్దెపైన బాత్‌రూమ్‌కు వెళ్లిందని చెప్పడంతో తల్లి అక్కడికి వెళ్లి పిలిచింది. అయితే నిహారిక పలక్కపోవడంతో కేకలు వేసింది. కిందనే ఉన్న భర్త ప్రకాష్‌కు తెలిపింది. అతను పైకి వచ్చి కొంత ప్రయత్నం చేసి తలుపు తీశాడు. ఇనుప పైపునకు చున్నీతో ఉరేసుకుని కనిపించిన నిహారికను చూసి తల్లిదండ్రులు షాక్ తిన్నారు. బాలికను కిందకు దించి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు తల్లి గుర్తించింది. హుషారుగా తిరిగే నిహారిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై జిలానీ కానిస్టేబుల్ విజయకుమార్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసున్నారు. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆయన మారలేదు

- నిత్యం మద్యం మత్తులోనే తూగుతున్న ఎంఈఓ
- అధికారుల మొద్దునిద్ర



మద్యం మత్తులో చెట్టు కింద శివనాగేశ్వరరావు

ఉలవపాడు: ఉలవపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల ఇన్‌చార్జి ఎంఈఓ శివనాగేశ్వరరావు తీరు మారలేదు. నిత్యం మద్యం మత్తులోనే తేలియాడుతున్నాడు. గురువారం మద్యం తాగి ఏకంగా పాఠశాల ఆట స్థలంలోని చెట్టు వద్ద పడిపోయాడు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. శివనాగేశ్వరరావు తీరు వల్ల విద్యార్థినులు, మహిళా టీచర్లు భయాందోళనలో ఉన్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు మాత్రం మొద్దునిద్ర వీడటం లేదు. విద్యార్థులకు ఏమైనా మాకేంటి.. విద్యాశాఖ దిగజారినా సరే.. ఆయన మత్తును మాత్రం వదిలించలేమనే స్థితిలో ఉన్నారు.

పంటకాలువలో మృతదేహం

అల్లూరు: మండల పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ నుంచి ఉలవపాళ్ల గ్రామం వెళ్లే దారిలోని పంటకాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గుర్తించారు. ఎస్సై కిశోర్‌బాబు కథనం మేరకు.. కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీయించారు. అతని వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండొచ్చని, నీటి లో మునిగి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు.

రైల్లో దోపిడీ కేసులో దర్యాప్తు వేగవంతం

- సాంకేతికత ఆధారంగా నిందితుల కోసం గాలింపు

నెల్లూరు(క్రైమ్): అల్లూరు రోడ్డు వద్ద చండీగఢ్ – మదురై ట్రైన్‌లో దోపిడీ కేసులో నెల్లూరు రైల్వే పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఎస్4 కోచ్‌లో ప్రయాణిస్తున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన రమ్య గుప్తా మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసును దుండగులు తెంపుకెళ్లారు. ఇప్పటికే ఆమె ఫిర్యాదు మేరకు కావలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఇంకొందరు కూడా బాధితులుండగా వారి వివరాలను సేకరిస్తున్నారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో సీఐ సుధాకర్ తన సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా విచారణ చేపట్టారు. ఒక బృందం గురువారం ఘటనా స్థలంతోపాటు జాతీయ రహదారి వెంబడి, గౌరవరం, వెంకటాచలం టోల్‌ప్లాజాల వద్ద, మరో బృందం విజయవాడ చేరుకుని రైల్వేస్టేషన్‌లోని సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వారి పనేనా?

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్‌లు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దోపిడీలకు పాల్పడుతుంటారని రైల్వే పోలీసులు చెబుతున్నారు. ఆ రెండు రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్‌లు ఈ తరహా నేరాల్లో సిద్ధహస్తులని సమాచారం. వేసవి కాలంలో ఈ ముఠా అనువైన ప్రాంతాల్లో రెక్కీ వేసి దోపిడీలకు పాల్పడుతుంటారు. గ్యాంగ్‌లోని కొందరు లక్ష్యంగా ఎంచుకున్న రైళ్లల్లో ప్రయాణిస్తూ దోపిడీకి ఏ బోగి అనుకూలంగా ఉంది? ప్రయాణికుల ఒంటిపై ఎంత బంగారం ఉంది? తదితర విషయాలను గమనిస్తుంటారు. మిగిలిన వారు దోపిడీకి అనుకూలంగా (జాతీయ రహదారికి సమీపం) సిగ్నల్ వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో కాపు కాస్తారు. రైలు కొద్దినిమిషాల్లో చేరుకుంటుందనగా సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలు ఆగేలా చేస్తారు. కింద ఉన్న వారు సైతం రైల్లోకి చొరబడి అందినకాడికి దోచుకుని పరారవుతారు. కొద్దిరోజులపాటు మిన్నకుండి మరో ప్రాంతంలో ఇదే తరహాలో నేరాలకు పాల్పడుతుంటారని తెలుస్తోంది. ఈ గ్యాంగ్‌లు రెండేళ్ల నుంచి పోలీసులకు చిక్కకుండా రైళ్లల్లో నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు.

అప్రమత్తమైన రైల్వే శాఖ

తాజా ఘటనతో రైల్వే పోలీస్ శాఖ అప్రమత్తమైంది. సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఆర్పీఎఫ్, స్థానిక సివిల్ పోలీసుల సహకారంతో నేరాల కట్టడికి పక్కా ప్రణాళికలు రూపొందిస్తోంది. రాత్రి వేళల్లో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లల్లో సాయుధ పోలీసులతో బీట్‌ను పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టారు. పాతనేరస్తులు తారసపడితే కాల్చేందుకు వెనుకాడొద్దని ఇప్పటికే ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. నేరనియంత్రణకు ప్రయాణికులు సహకరించాలని రైల్వే పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే 139, బీట్ సిబ్బందికి లేదా 112 నంబర్‌కు తెలియజేయాలని సూచిస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డైరెక్టర్ తదితరులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో గురువారం ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్స్పిరాన్– 2025 సాంకేతిక సదస్సు జరిగింది. ఇందులో రాష్ట్రంలోని 12 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక సదస్సుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఓడీ సురేష్‌రెడ్డి, కార్యక్రమ కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 125	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 246
లేయర్ (లైవ్)	: 105		
బ్రాయిలర్ చికెన్	: 220	లేయర్ చికెన్	: 178



'పది' మూల్యాంకనం ప్రారంభం

- విధులకు ఎగనామం పెట్టిన కొందరు టీచర్లు



మూల్యాంకనానికి వచ్చిన ఉపాధ్యాయులు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, బాలుర ఉన్నత పాఠశాలల్లో దీనిని చేపట్టారు. తొలిరోజు మూల్యాంకనంలో 612 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 103 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 190 మంది స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. తొలిరోజు 12,984 జవాబుపత్రాలను దిద్దారు. ఇదిలా ఉండగా మెజార్టీ శాతం ఉపాధ్యాయులు మూల్యాంకనానికి డుమ్మా కొట్టారు. 1,076 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లకు గానూ 612 మంది మాత్రమే హాజరయ్యారు. 174 మంది చీఫ్ ఎగ్జామినర్లకు గానూ 103 మంది, 348 మంది స్పెషల్ ఆఫీసర్లకు గానూ 190 మంది వచ్చారు. మూల్యాంకనానికి సరిపడా టీచర్లను మాత్రమే తీసుకుని మిగిలిన వారిని రిజర్వ్‌లో పెట్టామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. వాస్తవానికి దీని నుంచి తప్పించుకునేందుకు కొందరు టీచర్లు యూనియర్లు, రాజకీయ నాయకుల ద్వారా డీఈఓపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. దీంతో చేసేదేమీ లేక వచ్చిన వారితోనే జవాబు పత్రాలను దిద్దించారని ప్రచారం జరుగుతోంది.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
31-31-21, Ground & 1st Floor, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, Andhra Pradesh.

O.A. No. 189/2025
Canara Bank, Nellore
Vs
Billu Subba Rao (Died) & others

To
D2: Billu Venkatesh, S/o Subba Rao(Late), D.No.27-7-1009, Subaschandrabosu Nagar, Mahatma Gandhi Nagar, Nellore, Andhra Pradesh-522660.
D3: Billu Vanaja, D.No.27-7-1009, Subaschandrabosu Nagar, Mahatma Gandhi Nagar, Nellore, Andhra Pradesh-522660.

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

WHEREAS OA 189/2025 was listed before Hon'ble Presiding Officer/Registrar on 22-04-2025.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 44,03,023.34 ps/- (application along with copies of documents etc., annexed).
In accordance with sub-section (4) of Section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institution holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer / Registrar on 22-04-2025 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date 27th day of March, 2025.
Signature of Officer Authorized to issue Summons
Debts Recovery Tribunal, Visakhapatnam

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మూలాపేట ఇరుగాళమ్మగుడి నుండి 5కి.మీ దగ్గరలో నెల్లూరు కార్పొరేషన్లో బ్యాంకు లోను తో నుడా అప్రూవల్ ప్లాట్స్ అం।। 65వేల నుండి& ఇళ్ళు 45లక్షల నుండి అమ్మబడును. 90000 75785. [NA-11275]

SERVICES

CHANGE OF NAME

■ I, Sampath Kumar Dondapati S/o Vijaya Gouri B R/o C2-/C2-Pl/243, Pulicat Nagar, Krp, Sullurpeta, Nellore, Andhra Pradesh-524121, Have Changed The Name of My Minor Daughter Namely Snikitha Aarunya Dondapati (Aged 6 Years) And She Shall Hereafter Be Known As Snikitha Sampath Dondapati For All Future Purposes [DA-37601]

WANTED

■ Wanted Delivery Boys for ECOM Companies Like Flipkart, Meesho at Nellore. Contact : Sreeman Tech, Nellore. Cell : 78420 15550. [NA-6874]

■ IT & NON-ITలో ఉద్యోగాలు కలవు. (Pan India) టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్రదించండి: 9676971119, 9676841116. [NA-3042]

■ ప్రముఖ డయాగ్నోస్టిక్, పొగతోట, నెల్లూరు నందు Blood Sample Collect చేయుటకు అబ్బాయి,ద్విచక్ర వాహనం కలిగి ఉండవలెను. సంప్ర: 90323 56555, 92466 60007. [NA-3044]

■ నెల్లూరులోని ప్రముఖ కంపెనీలో పని చేయుటకు Tally,MS Office నందు అనుభవం కల లేడీ అకౌంటెంట్ కావలెను. వివరములకు సంప్రదించండి: 95025 28555. [NA-6872]

■ Andromeda కంపెనీ నందు పని చేయుటకు Sales, Tele, Survey కు సిబ్బంది కావలెను. జీతం: 12,000 నుండి 25,000.వివరములకు సంప్రదించండి: 9182826279. [NA-6873]

CHANGE OF NAME

My Daughter, CHINTHAMREDDY SRINITHYA REDDY D/o. SATHYA DEEPAK REDDY CHINTHAM REDDY shall hence forth be known as CHINTHAMREDDY SREENITHA REDDY (As per No.56 Gazette 1040, Dt. March 28th 2025,A.P.)D/o Sathyadeepak Reddy Chinthamreddy, Nellore.

■ ఆంధ్రకుట్టుమిషన్స్‌లో పనిచేయుటకు Male / Female Wanted. జీ।। 8000 to 12000. ఆంధ్రకుట్టుమిషన్స్. Opp: RS Brothers. Trunk Road, NLR. Cont: 99494 03526. [NA-1268024]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీరూం+భోజనం. HYD. 8317512135 [HA-245]

■ నిరుద్యోగులకు అవకాశం మా మెడికల్ షాప్ నందు పనిచేయుటకు ఆసక్తి ఉండి అనుభవం ఉన్నా లేకున్నా 18–30సం।। ల యువతీ యువకులు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సెల్:9989837783. [NA-1268081]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.